క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పుష్యమాసం నాల్గవ శనివారం సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. తాజాగా బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన క్రిష్ణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ గడువు పొడిగింపు

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ సెంటర్‌లో ఫస్ట్ ఇయర్ డిగ్రీలో చేరేందుకు ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీకోర్సుల్లో చేరేందుకు ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ పాస్ అయిన విద్యార్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొలాల్లోనే జొన్నలు కొనుగోలు



రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

అట్లూరు : రైతులు పండించిన జొన్నలను పొలాల్లోనే సివిల్ సప్‌లైద్వారా (సేకరణ)కొనుగోలు చేస్తున్నట్లు బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. శనివారం బద్వేలు మండల పరిధిలోని కొంగలవీడు గ్రామ పరిధిలోని సివిల్ సప్‌లై శాఖ(పౌర సరఫరాల శాఖ)ద్వారా శనివారం క్వింటాల్ రూ.3,180లతో కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా యాన మాట్లాడుతూ జొన్నలు బయట ధర రూ.2,300లకు ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం రైతుల వద్దకే వచ్చి రూ.3180లతో కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం రేషన్‌కార్డు దారులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు రైతుల నుంచి జొన్నలను కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్‌సప్‌లై శాఖ డిప్యూటీ తహసీల్దారు జి.శివశంకర్, శ్రీరెడ్డి బాషా పాల్గొన్నారు.

దంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న డెంటల్ సర్జన్ సబిత

బి.కోడూరు : విద్యార్థులు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం డెంటల్ సర్జన్ డాక్టర్ సబిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రోజుకు రెండు సార్లు బ్రష్‌తో పళ్ళు తోముకోవాలని, అప్పుడే విద్యార్థులు శుభ్రంగా ఉంటారని తెలిపారు. పళ్ళు ఎలా తోమాలో డెమోన్‌స్ట్రేషన్ చేసి చూపించారు. ఇలా చేయడం వలన పళ్ళు పుచ్చకుండా ఉంటాయని, నోటి క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. అలాగే పాఠశాలలోని 59 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి 44 మందికి దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారిని పోరుమామిళ్ల సీహెచ్‌సీకి రెఫర్ చేశారు. సీహెచ్‌ఓ నాగమణి ఆధ్వర్యంలో 36 మందికి టి.డి. టీకాలు వేశారు. హెల్త్ సూపర్‌వైజర్ విలియం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఏఎన్‌ఎం కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరశేఖర్ పాల్గొన్నారు.

వయో పరిమితి పెంచాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడం హర్షణీయమన్నారు. నోటిఫికేషన్ నాటి నుంచి జూన్ వరకు రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇందులో చేర్చి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి



నరసాపురంలో మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ

కాశినాయన : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధి చేకూరిందన్నారు. మహిళలకు అన్నివిధాలా మేలు చేసిన ప్రభుత్వం మన ప్రభుత్వమే అన్నారు. రాబోయే ఎన్నికల్లో మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జగనన్న అందరి కుటుంబాల్లో ఆనందం నింపారని, వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరు తమ ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి వేయించి గెలిపించాలన్నారు. మండలంలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కింద రూ.15.76 కోట్లు నిధులు డ్వాక్రా మహిళా సంఘాల సభ్యుల ఖాతాల్లో నేడు జమ కానున్నాయన్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్నదే అన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. డ్వాక్రా మహిళలు వేసిన కోలాటం ఆకట్టుకుంది. అందరికి భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హనుమంతరెడ్డి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ మదుసూదన్‌రెడ్డి, ఏపీఎం వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, పి.వి.గురివిరెడ్డి, వెంకటక్రిష్టారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి సిద్ధం కండి

బద్వేలు అర్బన్ : ఈ నెల 10వ తేదీ నుండి నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి సిద్ధం కావాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బద్వేలు మున్సిపాలిటీ, బద్వేలురూరల్, గోపవరం, అట్లూరు మండలాల ముఖ్య నాయకులతో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టాలని కోరారు. ముఖ్యంగా బూత్ కన్వీనర్లు, కార్యకర్తలను ప్రచారానికి సిద్ధం చేయడంతో పాటు బాధ్యతాయుతంగా పనిచేసేలా చూడాలని కోరారు. పంచాయతీల వారీగా, వార్డుల వారీగా నియమించిన ఇన్‌చార్జిలు బూత్ కన్వీనర్లను, సచివాలయ కన్వీనర్లను సమన్వయం చేసుకుని అలుపెరగకుండా ప్రచారం చేపట్టాలని కోరారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, పోలిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఆయా మండలాల కన్వీనర్లు మల్లేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, గోవిందరెడ్డి, పుల్లయ్య, హరి, మున్సిపాలిటీ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ముంగిటకు సంక్షేమం



సోమిరెడ్డిపల్లె 2 సచివాలయంను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడా ఏంటనేది ప్రతి ఇంటి ముంగిటకు సంక్షేమం ద్వారా తెలిసిందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం సోమిరెడ్డిపల్లె 2 గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటిదగ్గరకు వెళ్లి ప్రజల సమస్యలను తీర్చడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రలకు అందించిందన్నారు. గత చంద్రబాబు అధికారంలో ఉన్నపుడు ఏదైనా ప్రజలకు సమస్య తీరాలటే జన్మభూమి కమిటీల ద్వారా తీర్చుకోవాలన్నారు. మన ప్రభుత్వం లో పార్టీలకు అతీతంగా అర్హత కల్గిన ప్రతి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనను మళ్లీ సీఎంగా చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం రామగోవిందరెడ్డి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. పీఆర్ డిఈఈ మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఎంపిటీసీ యల్లటూరు ఈశ్వర్‌రెడ్డి, ఎంపిడీఓ శివమల్లేశ్వరప్ప, సింగల్ విండోఅధ్యక్షుడు సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్, స్థల ధాతలు పోచంరెడ్డి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు యల్లటూరి శివారెడ్డి, పాల రామిరెడ్డి, ఉమాపతి, భాస్కర్‌రెడ్డి, దస్తగిరి, రాజానాయుడు, సోమిరెడ్డిపల్లె పంచాయతీ నాయకులు, వాలంటరీలు. పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేసిన సీఎం



ఇంటి పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ

బద్వేలు అర్బన్ : పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంటరమణమ్మ, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య పేర్కొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో ఇంటి స్థలాలు మంజూరైన పలువురు లబ్ధిదారులకు శనివారం పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సొంత ఇల్లు లేని పేదలు ఏ ఒక్కరు ఉండకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ళ స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ళు కూడా మంజూరు చేసి చరిత్ర సృష్టించారన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడంతో పాటు మహిళలకు విలువైన ఆస్థిని అందజేసిన ముఖ్యమంత్రి మరో అడుగు ముందుకేసి ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా ప్రారంభించిందని, తద్వారా పేదలకు సర్వహక్కులతో లక్షల విలువైన ఆస్థి సొంతం కానుందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి..ప్రాణాలు కాపాడుకోండి



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ, ఎంవీఐ, ఎస్‌ఐ, సిబ్బంది

బద్వేలు అర్బన్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి నిండు జీవితాన్ని కాపాడుకోవాలని బద్వేలు అర్బన్ సీఐ పి.యుగంధర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఎంవీఐ కార్యాలయం నుంచి సిద్దవటంరోడ్డు, మైదుకూరురోడ్డు, నెల్లూరు రోడ్డుల మీదుగా పట్టణంలో హెల్మెట్‌లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంవీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందుకు కారణం వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించకపోవడమే అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తలకు గాయం కాకపోతే సాధ్యమైనంత వరకు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వలన సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చనే విషయాన్ని ప్రతి వాహనదారుడు గుర్తించుకోవాలన్నారు. అలాగే అతివేగం కూడా ప్రమాదాలకు మూలకారణమని దీనిని నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు స్వస్తి పలకాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్‌ఐ సత్యనారాయణ, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా బైక్ నడపడం ప్రమాదకరం

ప్రొద్దుటూరు క్రైం : హెల్మెట్ లేకుండా బైక్ నడపడం ప్రమాదకరమని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మైదుకూరు రోడ్డులోని టీవీఎస్ షో రూం వద్ద నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని శనివారం సీనియర్ ఎంవీఐ నారాయణనాయక్ ప్రారంభించారు. రిలయెన్స్ పెట్రోల్ బంకు సర్కిల్, శివాలయం సెంటర్, రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మురళీధర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ ప్రమాదానికి గురైనా చిన్నపాటి గాయాలతో బయటపడొచ్చని తెలిపారు. బైక్‌పై నుంచి కింద పడినప్పుడు ముందుగా తలకు గాయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ యుగంధర్, ఎంవీఐ నారాయణనాయక్, ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సబ్‌స్టేషన్ పనితీరుపై అవగాహన



132 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యార్థులు

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్యా నైపుణ్యాల శిక్షణలో భాగంగా శనివారం 132/33 కేవీ సబ్‌స్టేషన్ పనితీరుపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు కాశయ్య నేతృత్వంలో వృత్తివిద్యా శిక్షకుడు శ్రీనివాసులు విద్యార్థులతో సబ్‌స్టేషన్ ఏఈఈ స్వామి రంగారెడ్డిని కలిశారు. ఎలక్ట్రానిక్ విభాగ క్షేత్ర సందర్శనలో భాగంగా పవర్‌స్టేషన్ పనితీరుపై వివరించినట్లు శ్రీనివాసులు తెలిపారు. స్వామి రంగారెడ్డి విద్యార్థులకు పవర్ సరఫరా, యంత్రాల పనితీరు, 132 పవర్ స్టేషన్ ప్రత్యేకత, 11 కేవీ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా తదితర అంశాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు కృష్ణకాంత్, వర్క్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు సుజాత పాల్గొన్నారు.

బరువు తక్కువ పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎన్‌సీయూ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు క్రైం : రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ (ఆర్‌ఓపీ) అనేది నవజాత శిశువులకు శాపం లాంటిదని డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. జిల్లా ఆస్పత్రి కాంపౌండ్‌లోని జిల్లా బాలభవిత కేంద్రంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో పని చేసే వైద్యులు, స్టాఫ్ నర్సులకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ నేత్ర సమస్యలు అనేక రకాలుగా ఎదురవుతాయన్నారు. నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ సమస్య తలెత్తుతుందన్నారు. అవయవాలు పూర్తిగా అభివృద్ధి చెందకుండా జన్మించిన కొందరు శిశువుల్లో కంటి అంతర్భాగంలోని రెటీనా పొర అసమతొల్యంగా ఏర్పడుతుందని తెలిపారు. అయితే ఈ సమస్య ఉన్నట్లు గుర్తించకపోవడంతో శిశువులు శాశ్వత అంధత్వానికి గురవుతున్నారన్నారు. తక్కువ బరువుతో పుట్టిన చిన్నారులకు 21–25 రోజుల్లోపు రెటినోపతి పరీక్ష చేయాల్సి ఉంటుందని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా సమస్యను గుర్తిస్తే అంధత్వం రాకుండా చిన్నారులను కాపాడవచ్చని డాక్టర్ వివరించారు. బాలభవిత కేంద్రం వైద్యాధికారులు శ్రీనివాసులు, వాసంతి మాట్లాడుతూ ప్రతి మంగళవారం బాలభవిత కేంద్రంలో చిన్నారులకు ఆర్‌ఓపీ స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ చిన్నారుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ అనూష, ఫిజియోథెరపిస్టు ఆసిఫా, సైకాలజిస్టు ఉదయచంద్రిక, ఆడియాలజిస్టు శ్రీలేఖ, ఆప్టొమెట్రిస్టు జమీర్ పాల్గొన్నారు.

ఘన సన్మానం



తహసీల్దార్ నజీర్ అహ్మద్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రొద్దుటూరు : గత మూడున్నరేళ్ల కాలంలో రైతులతోపాటు ప్రజలకు విశిష్టమైన సేవలు అందించామని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు బదిలీ అయిన సందర్భంగా ఆయనకు శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం డీకేటీ భూములు, ఇనాం భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు అనుమతులు జారీ చేసిందన్నారు. తనతోపాటు తోటి ఉద్యోగులు సకాలంలో వివరాలు పొందడంతో గ్రామాల్లో ఎంతో మంది రైతులకు ఊరట కలిగిందన్నారు. విలువైన డీకేటీ భూములతోపాటు మాన్యం భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేలా హక్కు కల్పించామన్నారు. అనంతరం ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు మనోహర్‌రెడ్డి, సుదర్శన్, అజయ్ బాబు, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్‌ఓలు, వీఏలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రికెట్ విజేత ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు : ఆడుదాం ఆంధ్ర జిల్లా క్రికెట్ పురుషుల విజేతగా ప్రొద్దుటూరు నియోజకవర్గం ఎంపికైంది. గత నెల రోజుల నుంచి వివిధ దశలలో ఆడుదాం ఆంధ్ర పోటీలు జరిగాయి. కమలాపురం, ప్రొద్దుటూరు మధ్య ఫైనల్ పోటీలు జరగగా విజేతగా ప్రొద్దుటూరు జట్టు ఎంపికైంది. ఈనెల 9న విశాఖపట్నంలో 26 జిల్లాల మధ్య జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ప్రొద్దుటూరు జట్టు అర్హత సాధించింది.

ఎన్నికలకు ‘సిద్ధం’ కావాలి

- పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా
- బూత్ కమిటీ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నాగిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి

చాపాడు : మరో రెండు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే వస్తుందని.. ప్రతి కార్యకర్త ఎన్నికలకు సిద్ధం అవ్వాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి అన్నారు. మైదుకూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం బూత్ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని.. 90శాతం మంది మహిళలు మన వైపే ఉన్నారని, మన పార్టీ కార్యకర్తలు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులు ఎన్నికలకు సిద్ధమవ్వాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతి పథకాన్ని ప్రజలకు తెలియజేయాలని ప్రతిపక్షాలు చేసే అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. ప్రతి గ్రామంలోని కార్యకర్తలందరికీ అండగా ఉంటానని ఏ ఒక్కరూ కూడా అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. 2014 ఎన్నికల్లో అబద్ధాల హామీలతో అధికారంలో వచ్చిన చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారని, 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలకు బుద్ధి చెప్పారన్నారు. గత ఐదేళ్ల పరిపాలనలో సీఎం వైఎస్ జగన్ 98 శాతం హామీలను అమలు చేశారని దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్షుమయ్య, జడ్పీటీసీ శాంతరాజు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, చాపాడు మండల జేసీఎస్ కన్వీనర్ రామోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దంత పరీక్షలు

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి, రోటరీక్లబ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యనారాయణరెడ్డి, వైద్యులు ముకుందారెడ్డి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సైదాగారి వీధిలోని మన ప్రజా సేవా సమితి కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత రక్తనాళాల వైద్య పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు మన ప్రజా సేవా సమితి అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పల్లవోలులో కుష్టుపై అవగాహన ర్యాలీ

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో శనివారం కుష్టు వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రజలతో కలసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. మనిషి శరీరంపై స్పర్శ లేని మచ్చలు, కాళ్లలో తిమ్మిర్లు, నరాల వాపులు, బుడిపెలు, కనురెప్పలు రాలిపోవటం వంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీటిలో ఎలాంటి లక్షణాలు ఉన్నా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని వైద్యాధికారి సూచించారు.